## క్లుప్తంగా

### సూర్య ఘర్‌పై అవగాహన కల్పించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

**మెళియాపుట్టి:** సూర్య ఘర్ (సోలార్ సిస్టం)ను ప్రతీ కుటుంబం అమర్చుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. సోమవారం చాపర సచివాలయాన్ని సందర్శించారు. సూర్య ఘర్ ద్వారా అతి తక్కువ ధరకే సోలార్ పలకలను అమర్చుకోవాలన్నారు. దీని ద్వారా విద్యుత్ ఆదా చేయడమే కాకుండా.. బిల్లు కూడా తక్కువగా వస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గడ్డివాము దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

**జలుమూరు:** మండలంలోని సురవరం గ్రామ దేవత ఆలయం సమీపంలో ముద్దాడ అప్పలసూరికి చెందిన నాలుగు ఎకరాల గడ్డివాము సోమవారం దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో నరసన్నపేట ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే గడ్డి అంతా కాలిబూడిదైంది. రైతు అప్పలసూరి, నరసన్నపేట ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దుకాణాల సమీపంలోనే గడ్డివాము ఉండడంతో ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేక ఎవరో సిగరెట్ తాగిన వారు పొరపాటున ఇటు విసరడంతో జరిగిందా అన్నది తెలియరాలేదు. సుమారు రూ.20 వేల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపారు.

### లింగాలవలస వాసికి నంది అవార్డు

- కాళోజీ తెలుగు బుక్‌లో స్థానం



నంది అవార్డుతో వెంకటరమణ

**జలుమూరు:** మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన గంగరాపు వెంకటరమణ (బుర్ర కథ రమణ)కు నంది అవార్డ్ వరించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడ తమ్మలపల్లి కళా వేదికలో ఈయనకు అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ కవి కాళోజీ తెలుగు బుక్‌లో స్థానంతోపాటు ప్రశాంత పత్రం అందుకున్నాడు. గ్రామీణ కళలకు వన్నె తెచ్చిన రమణ గత 20 ఏళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు ప్రదర్శనలు ఇచ్చాడు. లింగాలవలసతో పాటు శ్రీకాకుళం జిల్లాకు పేరు తెచ్చిన రమణను గ్రామస్తులు అభినందించారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

**నరసన్నపేట:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రూమ్ నంబర్ ఒకటిని పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేయగా.. దీనిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 183 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 20 దరఖాస్తులు రాగా.. వాటిని పరిశీలన చేసి పంపామన్నారు. డీటీ శరత్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ లుకలాపు శ్రీను, కళాశాల తెలుగు అధ్యాపకులు రవికుమార్ ఉన్నారు.

### తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరును బాగు చేస్తున్న మెకానిక్‌లు

**కొత్తూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలోని తాగునీటి బోరును సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం బాగు చేశారు. కాలేజ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు 850 మంది విద్యార్థులకు అవసరమైన తాగునీటి సమస్యను పరిష్కరించారు. సర్పంచ్‌కు ప్రిన్సిపాల్ బందారు రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

### 10 మంది అరెస్ట్

**పొందూరు:** మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో ఆదివారం ఇరువర్గాల మధ్యన జరిగిన కొట్లాట కేసుకు సంబంధించి సోమవారం పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పాత కేసులను రాజీ చేసుకునే క్రమంలో ఘర్షణ నెలకొని కొట్లాటకు దారితీసిందన్నారు. దీనిపై ఇరువర్గాలవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గానికి చెందిన ఇద్దరిని, రెండో వర్గానికి చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు, కొట్లాటలు జరగకుండా ముందస్తుగా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

# దివ్యాంగ పింఛన్‌దారుల్లో.. ఆందోళన



సర్టిఫికెట్ల పునఃపరిశీలన చేస్తున్న వైద్యులు

- అష్టకష్టాలు పడి సదరానికి వస్తున్న దివ్యాంగులు
- ఇప్పటివరకు 201 మంది సర్టిఫికెట్ల పరిశీలన
- 60 శాతానికి పైగా రద్దయ్యే ప్రమాదం!

**నరసన్నపేట:** ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగ పింఛన్లు పొందేవారి సర్టిఫికెట్ల పునఃపరిశీలన గత కొద్ది రోజులుగా జరుగుతోంది. స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఇప్పటివరకు (నాలుగు రోజుల్లో) 201 మంది సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేశారు. నరసన్నపేట మండలంలో 497 మంది దివ్యాంగులకు పింఛన్లు వస్తుండగా.. వీరందరి సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేయనున్నారు. గత నెల 27న పలాసకు చెందిన వైద్యుడు చిన్నంనాయుడు, 28, 29 తేదీలతోపాటు సోమవారం పాలకొండకు చెందిన అర్థో వైద్యురాలు యశశ్విని సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఇప్పటివరకు జరిగిన వాటిలో 60 శాతానికి పైగా పింఛన్లు కట్ అయ్యే ప్రమాదం ఉందని సమాచారం. చాలామంది అనర్హులుగా ఉన్నారని వైద్యులు అంటున్నారు. చాలా ఏళ్లుగా సర్టిఫికెట్ల పరిశీలన చేయకపోవడంతో 50 శాతానికి పైగా బోగస్‌వి ఉన్నాయనేది సమాచారం. వీరంతా పింఛన్లను కాపాడుకోవడానికి కూటమి నాయకులు, కార్యకర్తల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు.

### చాలా ఏళ్లుగా పింఛన్ వస్తోంది



పుట్టినప్పటి నుంచి అంగ వైకల్యం ఉంది. రెండు కాళ్లూ పనిచేయవు. ఇతరులపైనే ఆధారపడి జీవిస్తున్నా. తల్లిదండ్రులే అన్ని పనులు చేస్తున్నారు. ఇప్పుడు సర్టిఫికెట్ పునః పరిశీలనకు రావడానికి అనేక ఇబ్బందులు పడ్డాను. నాలాంటి వారికి ఇటువంటి కష్టాలు పెట్టడం తగదు.

– **దాసరి కన్నమ్మ**, దివ్యాంగ పింఛన్‌దారు, చెన్నాపురం, నరసన్నపేట మండలం

### మాలాంటి బాధలు ఎవరికీ రాకూడదు



మాలాంటి బాధలు ఇతరులకు రాకూడదు. వికలాంగ సర్టిఫికెట్ పరిశీలన చేసుకోవాలని సచివాలయ సిబ్బంది చెప్పారు. 15 కిలో మీటర్ల దూరం నుంచి ఆటోపై వచ్చాను. ఇద్దరు తోడుగా వచ్చారు. ఐదేళ్ల వయస్సు నుంచి పింఛన్ వస్తోంది. ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ల పరిశీలన ఏమిటో తెలియడం లేదు.

– **జమ్ము శ్రీదేవి**, దివ్యాంగ పింఛన్‌దారు, గొనబుపేట, నరసన్నపేట మండలం

## టార్గెట్లు లేక నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



అలుదులో రోడ్డు పక్కనే నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

**సారవకోట:** మండలంలో టార్గెట్స్ లేకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు నిల్చిపోయాయి. ఇప్పటివరకు ప్రభుత్వం 22,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. మరో 5 వేల మెట్రిక్ టన్నులు మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంది. గతకొన్ని రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయింది. గతేడాది మండలంలో 26 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది 22,600 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో రైతుల కళ్లాల్లో ధాన్యం కుప్పలు కొన్నిచోట్ల ఉంచగా.. మరికొన్ని చోట్ల ధాన్యం నిల్వలను రోడ్డు పక్కనే ఉంచారు. దీనిపై వ్యవసాయాధికారి వెంకటరావుకు వివరణ కోరగా.. 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు కోరామన్నారు. అనుమతులు వచ్చిన తరువాత వాటిని కొనుగోలు చేస్తామన్నారు.

## భగవద్గీత ప్రచారం



పాత ఆమదాలవలసలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

**ఆమదాలవలస:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం ఆమదాలవలస పట్టణంలోని పాత ఆమదాలవలస, ఆమదాలవలస గేటు ప్రాంతాల్లో నిర్వహించారు. రథసప్తమి పండగ కోసం భగవద్గీత జ్ఞాన ప్రకారం ఇంటింటికీ వెళ్లి వివరించారు. భగవద్గీత జ్ఞానం ప్రకారం 'క్రాంతి అంటే తిరుగుబాటు' అని, 'సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు' అని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సంతోష్ కుమార్, దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ, అప్పన్న, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో..



సారవకోట మండలంలోని కిన్నెరవాడ గ్రామ దేవత ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికులు రూ.8.50 లక్షలు వెచ్చించి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి, లక్ష్మీ హోమం నిర్వహించి గ్రామ దేవత విగ్రహ దర్ప దర్శనం, నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ప్రత్యేక, విశేష పూజలను రుత్వికులు ప్రభాకర శర్మ చేయించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. **- సారవకోట**

### వైభవంగా..



నరసన్నపేట మండలం సత్యవరాగ్రహారంలోని పాదాలమ్మ తల్లి (చరణాంబిక) ఆలయ నాలుగో వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాఘ శుద్ధ పంచమి సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు, పాదాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ముగ్గురాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, వార్డు సభ్యులు ఇప్పిలి నీలం, సీర లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **- నరసన్నపేట**

### కల్యాణం.. కమనీయం



సారవకోట మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి కల్యాణం చేయించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేశారు. **- సారవకోట**

### ప్రకృతి ఉత్పత్తుల విక్రయం



పాతపట్నం మండల కేంద్రంలోని కోర్టు కూడలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆర్‌వైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. మండలంలోని కాగువాడ, చిన్న మల్లిపురం ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలను సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, ఇక్కడకు వచ్చినవారు కొనుగోలు చేశారు. **- పాతపట్నం**

## ప్రమాదకరంగా సింగుపురం వంతెన



పాడైన సింగుపురం వంతెన

**పాతపట్నం:** మండలంలోని టెక్కలి–తెంబూరు రహదారి నుంచి సింగుపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న గుమ్మగెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బెర్మలు కోతకు గురికావడంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. సింగుపురం, గురండి మీదుగా ధనుపురం వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో రైతులు చెరుకు, వరి చేనును బళ్లు, ట్రాక్టర్లపై తరలిస్తుంటారు. వ్యవసాయ పనులకు కూడా ఈ వంతెన మీదుగా వెళ్తుంటారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే నూతన వంతెన నిర్మాణం చేట్టాలని పలువురు కోరుతున్నారు.

### దట్టంగా పొగమంచు



దబ్బపాడు ప్రాంతంలో కురుస్తున్న పొగ మంచు

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 8:30 గంటల వరకు పొగ మంచు కురుస్తూనే ఉంది. పొగ మంచు కారణంగా మామిడి, జీడి పూతకు నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఉదయం 9 గంటల వరకు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న పొగమంచు కారణంగా వృద్ధులు, చిన్నారులు, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

### అధ్వానం..



బొర్రంపేట వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు

**ఎల్.ఎన్.పేట:** మండలం పరిధిలోని ఉన్న అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారిపై ఉన్న గోతులతో ప్రయాణికులు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గోతుల రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంటుందని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. మండలం పరిధిలోని బొర్రంపేట, గోనెపాడు కూడలి, ముంగెన్నపాడు కూడలి వద్ద రోడ్డు గోతులమయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబర్ మొదటి వారంలో సీఎం చంద్రబాబు 'సంక్రాంతికి చక్కటి రోడ్లు..' వేస్తామని నమ్మించి మోసం చేశారని ప్రయాణికులు అంటున్నారు. 2025 జనవరిలో వచ్చిన సంక్రాంతి వెళ్లిపోయిందని, అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## చంద్రబాబు, పవన్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం

- రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడని కేంద్ర బడ్జెట్
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**ఎల్.ఎన్.పేట:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీహార్ రాష్ట్రానికి వరాల జల్లులు కురిపించిందని, ఆంధ్రప్రదేశ్‌కు మొండిచెయ్యి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనం కోసం, ప్రజల సంక్షేమం కోసం నిధులు తీసుకురావటంలో వైఫల్యం చెందారన్నారు. రాజకీయ ప్రయోజనాలు కోసమే కేంద్రం వద్ద పనిచేస్తున్నారని, రాష్ట్ర సంక్షేమం వారికి అవసరం లేదన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మిస్తుంటే దీన్ని 41 మీటర్లకు కేంద్రం కుదిస్తూ నిధులు కేటాయించేందుకు అంగీకరించిందన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బడ్జెట్ మంచిగా ఉందని, రాష్ట్రానికి ప్రాధాన్యత ఉందని సీఎం చంద్రబాబు పేర్కొనటం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. పేదలకు, అవ్వాతాతలకు ఇస్తున్న పింఛన్లలో ప్రతీ నెల కోత జరుగుతుందని మండిపడ్డారు. ఏడు నెలల పాలనలో ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అనేక సందర్భాల్లో ప్రజలకు నమ్మించిన సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు.

## భక్తిశ్రద్ధలతో సూర్య నమస్కారాలు



తామరాపల్లి స్కూల్లో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

**నరసన్నపేట:** రథ సప్తమి సందర్భంగా పాఠశాలల్లో మూడు రోజులుగా సూర్య నమస్కారాలు నిర్వహించారు. సోమవారంతో సూర్య నమస్కారాలు ముగిశాయి. తామరాపల్లితోపాటు నరసన్నపేట, సత్యవరం, ఉర్లాం, మడపాం, చోడవరం, తదితర స్కూళ్లలో భక్తిశ్రద్ధలతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీటిని కొనసాగించాలని ఎంఈఓ దాలినాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. దీనివలన విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని అభిప్రాయపడ్డారు.

## ● సరస్వతీ నమస్తుభ్యం



సారవకోట: హంస వాహనంపై సరస్వతీదేవిగా నీలమణి అమ్మవారి ఉత్సవ విగ్రహం

వసంతపంచమి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. పలుచోట్ల సరస్వతీ హోమాలు నిర్వహించారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**- సాక్షి నెట్‌వర్క్**



జలుమూరు: జలుమూరు ప్రాథమిక పాఠశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సారవకోట: అద్దపనస బీవీకే పాఠశాలలో అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు



నరసన్నపేట: విజ్ఞాన భారతి స్కూల్లో జ్ఞాన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పాతపట్నం: పాతపట్నంలోని షిర్డీ సాయి ధాన్య మందిరంలో సామూహిక అక్షరాభ్యాసం

## శిథిలావస్థ..



సవలాపురం జంక్షన్ వద్ద శిథిలమైన రక్షణ గోడ

**సరుబుజ్జిలి:** అలికాం–బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలో పలుచోట్ల రక్షణ గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరకున్నాయి. వాహనాలు రాకపోకలు చేసే సమయంలో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. శిథిలమైన రహదారిపై భారీ ఇసుక లారీలు ప్రయాణాలు చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. సరుబుజ్జిలి మండలం పరిధిలోని సవళాపురం జంక్షన్ వద్ద, ఏఎల్‌నగరం, కొత్తకోట వద్ద రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గోతులమయం

**పాతపట్నం:** పాతపట్నం రైల్వే స్టేషన్ గేట్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ పనులు సంవత్సరాల కొద్దీ సాగుతున్నాయి. శ్రీకాకుళం, టెక్కలి నుంచి వచ్చే వాహనాలు, ఇటు పాతపట్నం నుంచి శ్రీకాకుళం, టెక్కలి వెళ్లే వాహదారులు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి ఈ రహదారి మీదుగా రావాల్సి ఉంది. ఫ్లై ఓవర్ పనులు చేపడుతుండటంతో రహదారిలో గోతులు ఏర్పడి ప్రమాదకంగా మారాయి. ఈ రహదారి వైపు రావాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి, రహదారి గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



పాతపట్నం రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ పక్కన గోతులతో ఉన్న జాతీయ రహదారి